సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం ◆ 20 ◆ సెప్టెంబర్ ◆ 2023



చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ శివారులో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



అన్ని వర్గాలకు అండగా..

అన్ని వర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



దంపతుల దుర్మరణం

నల్లగొండ పట్టణ శివారులోని పానగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. - 8లో

న్యూస్‌రీల్

జీహెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ పూర్తి

భువనగిరి: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా జీహెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేశారు. మల్టీజోన్–2 పరిధిలో 163 జీహెచ్‌ఎం పోస్టులు ఉండగా 89 ఖాళీలు ఉన్నాయి. జీహెచ్‌ఎంల బదిలీల్లో భాగంగా జిల్లాకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు 26 మంది ఉండగా జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన వారు 22 మంది ఉన్నారు. మిగిలిన వారు జిల్లాలో ఉన్న వారు జిల్లాలో ఇతర ప్రదేశాలకు బదిలీ అయ్యారు. ఇప్పటికే వారు ఆర్డర్లను తీసుకుని ఆయా పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. అనంతరం సీనియార్టీ జాబితాను రూపొందించి, ప్రదర్శించిన తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు ఇవ్వనున్నారు. వీరు జిల్లాలో 600 నుంచి 700 మంది వరకు ఉన్నారు.

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు

భువనగిరిటౌన్: అంగన్‌వాడీ టీచర్లు సమ్మె చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆలేరు, భువనగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 284 కేంద్రాల్లోని 417 మంది అంగన్‌వాడీ టీచర్లు, 346 మంది ఆయాలు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెప్మా, డీఆర్‌డీఓ, పంచాయితీరాజ్ తదితర శాఖల సమన్వయంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో ప్రతిరోజు లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మారుతి దేవి

భువనగిరి: ప్రజలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మారుతి దేవి అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో వైవాహిక వ్యవస్థ వివాదాలతో బలహీన పడుతోందన్నారు. ప్రజలకు సామాజిక స్థితిగతులను చూపిస్తూ లఘు చిత్రాల ద్వారా చైతన్యాన్ని, మార్పును తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. ఈమేరకు వైవాహిక జీవనంలో వివాదాలు వాటి ప్రభావం, పేదరిక నిర్మూలన అంశాలపై తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ సలహాదారు సాయిప్రసాద్ దర్శకత్వంలో లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సలహాదారు సాయిప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. అదేవిధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు.

ఇంటింటికీ గ్యారంటీ కార్డు

- నియోజకవర్గానికో ఏఐసీసీ నేత
- గ్రామాలు, పట్టణాల్లో పంపిణీకి శ్రీకారం
- విజయభేరి సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో ఆనందం



భువనగిరిలోని జలీల్‌పురలో మహిళలకు కాంగ్రెస్ గ్యారంటీ కార్డును అందిస్తున్న ఏఐసీసీ జనరల్ సెక్రటరీ విష్ణునాథ్, సంజీవరెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తుక్కుగూడ సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇంటింటికి తీసుకుపోయే కార్యక్రమాన్ని ఏఐసీసీ ప్రతినిధులు వినాయక చవితి రోజున జిల్లాలో ప్రారంభించారు. ఇందుకోసం నియోజకవర్గానికో ఏఐసీసీ నేతకు బాధ్యతలను అప్పగించారు. ఏఐసీసీ ప్రతినిధులు జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో 'ఇంటింటికి ఆరు గ్యారంటీలు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాల ప్రచారాన్ని ఇంటింటికి తీసుకుపోనున్నారు. తొలిరోజు ఎంపిక చేసిన కేంద్రాల్లో గ్యారంటీ కార్డులను ప్రజలకు అందజేసి వాటి గురించి వివరించారు. భువనగిరిలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ పీసీ విష్ణునాథ్, ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్టలో కర్ణాటకకు చెందిన ఎమ్మెల్యే సచిన్‌రావు ప్రారంభించారు. ఆలేరు నియోజకవర్గ కార్యక్రమాన్ని యాదగిరిగుట్టలో చేపట్టగా, ఇంచార్జ్ సచిన్‌రావుతో పాటు డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు. భువనగిరిలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ విష్ణునాథ్‌తోపాటు డీసీసీ అధ్యక్షుడు, సంజీవరెడ్డి, నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి, ప్రమోద్‌కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్, పంజాల రామాంజనేయులు, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి మేనిఫెస్టో

పార్టీ రూపొందించిన మేనిఫెస్టోను ప్రతి వ్యక్తికి చేరే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని రూపొందించింది. ఆరు గ్యారంటీలను ప్రతి బూత్‌లో ఉన్న ప్రతి ఓటరు తెలియచెప్పనున్నారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ లీడర్‌సంతకాలు చేసిన గ్యారంటీ కార్డులను కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ ఇలా అన్ని విభాగాలు ఇంటింటికి వెళ్లి ఇచ్చి వాటిని వివరిస్తారు. ఎప్పటికప్పుడు ఈ వివరాలను పార్టీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఎన్నికల వరకు నిరంతరాయంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

సభ సక్సెస్‌తో జోష్

హైదరాబాద్ తుక్కుగూడలో జరిగిన విజయభేరి బహిరంగ సభ సక్సెస్‌తో క్యాడర్‌లో జోష్ నెలకొంది. జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా సభకు తరలివెళ్లారు. తుక్కుగూడకు పొరుగున ఉన్న జిల్లా కావడంతో భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల నుంచి వందలాది వాహనాల్లో వెళ్లారు. టికెట్ ఆశిస్తున్న నాయకులు వాహనాలను సమకూర్చారు.

ఢిల్లీకి ఆశావహులు


వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్న ఆశావహులు మంగళవారం ఢిల్లీ బాట పట్టారు. దరఖాస్తులను పరిశీలించి పీసీసీ.. నియోజకవర్గానికి ఒకటి రెండు పేర్ల జాబితాలను ఏఐసీసీకి పంపించిన విషయం తెలిసిందే. అగ్రనేతల సభ అనంతరం టికెట్ వస్తుందనుకున్న ఆశావహులు ఢిల్లీ చేరారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ, ఏఐసీసీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బీర్ల అయిలయ్య, పంజాల రామాంజనేయులు ఇప్పటికే ఢిల్లీ చేరుకోగా మరికొందరు అదే బాటలో ఉన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

సాక్షి, యాదాద్రి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పీసీ విష్ణునాథ్ అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికలు ముగిసే వరకు పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు.



సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 80962 93702

జాబితాను పారదర్శకంగా రూపొందించాలి




మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకురాలు నిర్మల

- ఓటరు జాబితా పరిశీలకురాలు నిర్మల

సాక్షి,యాదాద్రి: తుది ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఓటరు జాబితా పరిశీలకురాలు నిర్మల సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో మండలాల వారీగా ఫామ్ 6, 7, 8 దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ప్రతివారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారికి ఫామ్ 6, 7, 8లో మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన దరఖాస్తు వివరాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఓటరు జాబితాలో గ్రామస్థాయి నుంచి వివిధ స్థాయిల్లో ఉండే ప్రముఖుల పేర్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఫామ్ 6,7, 8కు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వారం రోజుల్లోపు ఆన్‌లైన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ గత సెప్టెంబర్ 26, 27, ఈనెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, జిల్లాలోని 421 గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఓటరు నమోదుపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా భాగంగా ఓటు నమోదు, ఓటరు చైతన్యంపై విద్యా సంస్థల్లో స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, ప్రోత్సక్ ప్రమోద్ కుమార్, కూర వెంకటేశం, ఈరపాక నరసింహ, బట్టుపల్లి అనురాధ, కిరణ్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరచారి, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి డీఎస్సీ దరఖాస్తులు

- వచ్చే నెల 21 వరకు గడువు
- జిల్లాలో భర్తీ కానున్న 99 పోస్టులు



భువనగిరి: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ గడువు వచ్చే నెల 21వ తేదీ వరకు ఉంది. కాగా.. జిల్లాలో బీఈడీ చేసిన వారు 4,251 మంది, డీఈడీ చేసిన అభ్యర్థులు 3,548 మంది ఉన్నారు. వీరితో పాటు లాంగ్వేజ్ పండిట్ చేసిన వారు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన 99 పోస్టులను విద్యాశాఖ అధికారులు రోస్టర్ ప్రకారం రూపొందించారు. దీని ప్రకారం కేటగిరీల్లో ఒకటి, రెండు, లేదా ఒక్క కూడా పోస్టు లేని పరిస్థితి నెలకొంటుండడంతో అభ్యర్థులకు నిరాశ తప్పడం లేదు.

కేటాయించిన పోస్టుల వివరాలు

- ఎస్‌ఏ (బయోసైన్స్) తెలుగు: ఓసీ కేటగిరి జనరల్‌లో 1, మహిళా కేటగిరిలో 1, ఎస్సీ మహిళా కేటగిరిలో 1,
- ఎస్‌ఏ(హిందీ): జనరల్ కేటగిరిలో 2, మహిళా కేటగిరిలో 1, ఎస్సీ మహిళా కేటగిరిలో 1, బీసీ ఏ మహిళా కేటగిరిలో 1, బీసీ సీ జనరల్ కేటగిరిలో 1, వీహెచ్ మహిళా కేటగిరిలో 1 చొప్పున ఖాళీలు ఉన్నాయి.
- ఎస్‌ఏ(ఉర్దూ): జనరల్ మహిళా కేటగిరిలో 1,
- ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)తెలుగు: ఓసీ జనరల్ మహిళా కేటగిరిలో 1,
- ఎస్‌ఏ(సోషల్ స్టడీస్) తెలుగు: ఓసీ జనరల్ కేటగిరిలో 3, మహిళా కేటగిరిలో 2, ఎస్సీ జనరల్ కేటగిరిలో 2, మహిళా కేటగిరిలో 1, ఎస్టీలో జనరల్ కేటగిరిలో 1, మహిళా కేటగిరిలో 1, బీసీ ఏ మహిళా కేటగిరిలో 1, బీసీ (బీ) మహిళా కేటగిరిలో 1, బీసీ (సీ) జనరల్ కేటగిరిలో 1, వీహెచ్ మహిళా కేటగిరిలో 1, ఈడబ్ల్యూఎస్ జనరల్ కేటగిరిలో 1, ఎక్స్‌సర్వీస్ కేటగిరిలో 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఎస్‌ఏ(తెలుగు): ఓసీ జనరల్ కేటగిరిలో 3, మహిళా కేటగిరిలో 1, ఎస్సీ జనరల్ కేటగిరిలో 1, మహిళా కేటగిరిలో 1, ఎస్టీ మహిళా కేటగిరిలో 1, బీసీ ఏ మహిళా కేటగిరిలో 1, బీసీ బీ మహిళా కేటగిరిలో 1, వీహెచ్ మహిళా కేటగిరిలో 1, ఈడబ్ల్యూఎస్ జనలర్ కేటగిరిలో 1,
- ఎల్‌పీ(హిందీ): ఓసీ జనరల్ కేటగిరిలో 2, మహిళా కేటగిరిలో 1, ఎస్సీ మహిళా కేటగిరిలో 1, బీసీ ఏ మహిళా కేటగిరిలో 1,
- ఎల్‌పీ(తెలుగు) ఓసీ జనరల్ కేటగిరిలో 3, మహిళా కేటగిరిలో 2, ఎస్సీ జనరల్ 1, మహిళా కేటగిరిలో 1, ఎస్టీ మహిళ 1, బీసీ ఏ మహిళ 1, బీసీ బీ మహిళ 1, వీహెచ్ మహిళా కేటగిరిలో 1, హెచ్‌హెచ్ జనరల్ కేటగిరిలో 1, ఈడబ్ల్యూఎస్ జనలర్ 1, ఎక్స్ సర్వీస్ కేటగిరిలో 1,
- ఎల్‌పీ(ఉర్దూ) ప్రభుత్వ: ఓసీ మహిళా కేటగిరిలో 1,
- పీఈటీ(తెలుగు): ఓసీ మహిళా కేటగిరిలో 1, ఎస్సీ మహిళా కేటగిరిలో1,
- ఎస్జీటీ(తెలుగు)ప్రభుత్వ: ఓసీ జనరల్‌లో 2, మహిళా కేటగిరిలో 1, ఎస్సీ జనరల్‌లో 1, మహిళా కేటగిరిలో 1, బీసీఏ మహిళా కేటగిరిలో 1, వీహెచ్ మహిళా కేటగిరిలో 1,
- ఎస్జీటీ(తెలుగు): ఓసీ జనరల్‌లో 5, మహిళా కేటగిరిలో 4, ఎస్సీ జనరల్‌లో 3, మహిళా కేటగిరిలో 2, ఎస్టీ జనరల్ కేటగిరిలో 1, మహిళా కేటగిరిలో 1, బీసీ ఏ జనరల్‌లో 2, మహిళా కేటగిరిలో 1, బీసీ బీ జనరల్‌లో 1, మహిళా కేటగిరిలో 1, బీసీ సీ జనరల్‌లో 1, బీసీ డీ మహిళ కేటగిరిలో 1, బీసీ ఈ మహిళా కేటగిరిలో 1, వీహెచ్ మహిళా కేటగిరిలో 1, హెచ్‌హెచ్ జనరల్‌లో 1, ఈడబ్ల్యూఎస్ జనరల్‌లో 2, మహిళా కేటగిరిలో 1, ఎక్స్‌సర్వీస్ కేటగిరిలో 1 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి


యాదగిరిగుట్ట: ఆరోగ్య మహిళా కేంద్రాల్లో ప్రతి మంగళవారం నిర్వహించే వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలకు ఇప్పటివరకు చేసిన పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గుండాల, బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం పరీక్షలు నిర్వహించేవారని, గత వారం నుంచి జిల్లాలో మరో 4 మహిళా ఆరోగ్య కేంద్రాలు యాదగిరిగుట్ట, వలిగొండ, నారాయణపూర్, పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పాపారావు, డాక్టర్ వినోద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వంశీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

పథకాలు అర్హులకు చేరేలా కృషి చేయాలి

- జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరిటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా అధికారులు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో మూడు స్థాయీ సంఘాల ప్రణాళిక, ఆర్థిక నిర్మాణాలు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంపై నిర్వహించిన సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధిని ఆశిస్తూ ప్రభుత్వం పలు పథకాలు, నిర్మాణాలను చేపడుతుందన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు నిర్మాణాలతో పాటు, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి రహదారి సౌకర్యాన్ని మెరుగుపర్చాలని తెలిపారు. ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల పరిధిలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల సముదాయంలో అసంపూర్తి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. బస్‌స్టేషన్లలో ప్రయాణికుల సదుపాయాలు మెరుగుపర్చాలని సూచించారు. స్థలాల అద్దెలను వ్యాపారుల నుంచి శాస్త్రీయంగా వసూలు చేయాలన్నారు. కూలీలకు పని కల్పించడంతో పాటు నిర్ణీత వ్యవధిలో కూలీ చెల్లించాలని చెప్పారు. పరిశ్రమలకు దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరంగా అనుమతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఈఓ కృష్ణారెడ్డి, సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని సభ్యుడు డాక్టర్ కుడుదుల నగేష్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా డయాలసిస్ యూనిట్‌లో మరో ఐదు పడకలను ఏర్పాటు చేయాలన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాల జారీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యాశాఖలోని ఎంఈఓ పోస్టులను భర్తీ చేసి పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలని కోరారు. బెల్ట్ దుకాణాలు నియంత్రించాలని, గంజాయి రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ దక్కలే..!


అధికారుల తప్పిదాలు రైతులకు శాపంగా..

- ఇద్దరు ముగ్గురు రైతులకు ఒకే ఆధార్, ఫోన్ నంబర్ పంపిన అధికారులు
- ఈ కారణంతో ఉమ్మడి జిల్లాలో 1536 మంది రైతులకు దక్కని మాఫీ
- బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



తప్పుడు సమాచారం కారణంగా రుణమాఫీ పొందని రైతుల వివరాలు

జిల్లా	బాధిత రైతులు	మాఫీ కావాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
నల్లగొండ	829	4.93
సూర్యాపేట	317	1.77
యాదాద్రి	390	2.30



ఈ ఫొటోలోని రైతు కందుకూరి జనార్దన్‌రెడ్డి. ఈ రైతు సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని పాలకవీడు పీఏసీఎస్‌లో ఎనిమిదేళ్ల క్రితం వ్యవసాయ రుణం తీసుకున్నాడు. ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్ ప్రకారం ఈ రైతుకు రుణం మాఫీ కావాల్సి ఉంది. కానీ ఈ రైతుకు అదే పీఏసీఎస్‌లో రుణం తీసుకున్న మరో రైతుకు సంబంధించిన ఆధార్, ఫోన్ నంబర్‌ను అధికారులు జాబితాలో పంపారు. దీంతో ఈ ఇద్దరు రైతులు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి దూరమయ్యారు. ఇలా ఉమ్మడి జిల్లాలో అధికారుల తప్పిదాల వల్ల అర్హత ఉన్న రైతులకు మాఫీ అందలేదు.

నల్లగొండ అగ్రికల్చర్ : అధికారుల తప్పిదాల వల్ల అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ దక్కలేదు. అధికారులు రుణమాఫీ జాబితా తయారు చేసే సమయంలో ఇద్దరు ముగ్గురు రైతులకు ఒకే ఆధార్, ఫోన్ నంబర్‌ను వేసి పంపడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. ఒకే సర్వే నంబర్‌పై పలువురు రైతులు పేర్ల కూడా పంపారు. ఇలాంటి సమస్య ఉన్న రైతులకు ఇప్పటికి రుణమాఫీ డబ్బులు జమకాలేదు. జూలై 26 నుంచి ప్రభుత్వం రుణమాఫీ డబ్బులను రైతుల రుణ ఖాతాల్లో జమ చేస్తోంది. అధికారులు చేసిన పొరపాట్ల కారణంగా కొందరు రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా లబోదిబోమంటూ బ్యాంకులు, వ్యవసాయ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

హడావుడిగా జాబితాల తయారీ..

2018 ఎన్నికల సమయంలో రైతులకు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 2018 డిసెంబర్ 11 లోపు రూ.లక్షలోపు రుణాలు ఉన్న రైతుల జాబితాను పంపించమని ప్రభుత్వం బ్యాంకర్లను ఆదేశించింది. దీంతో బ్యాంకు అధికారులు హడావుడిగా రుణ గ్రహీతల జాబితాను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ జాబితాలను సరిచూసుకోలేదు. రెండు సంవత్సరాల క్రితం రూ.25 వేలలోపు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. తిరిగి జూలై 26వ తేదీ నుంచి రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తోంది. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేసినప్పటికీ కొందరు రైతులకు మాఫీ అందలేదు. ఇదేమని రైతులు.. బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులను అడిగితే.. ఒకరిపై మరొకరు మాది తప్పు కాదంటే.. మాది తప్పు కాదని బదులిస్తున్నారు. మరికొన్ని చోట్ల బ్యాంకుల్లో సరి చేస్తారని చెబుతుండగా.. కొన్ని చోట్ల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తప్పులను సరిచేసి సరైన జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి రుణమాఫీ అందేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

బ్యాంకుల్లో సరిచేయించుకోవాలి



ఏమైనా పొరపాట్లు జరిగి రుణమాఫీ కాని రైతులు ఆయా బ్యాంకుల్లో సరిచేయించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. రైతులు వెంటనే సంబంధిత బ్యాంకులకు వెళ్లి జరిగిన పొరపాట్లను సరిచేయించుకుంటే వారికి రుణమాఫీ డబ్బులు రుణఖాతాలో జమ చేస్తారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ నల్లగొండ

● కొలువుదీరిన గణనాథులు



భువనగిరి పట్టణంలోని తారకరామ నగర్‌లో శ్రీమణికంఠ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం



భువనగిరిలోని సర్దార్ సిద్ధార్థ్ యూత్ ఆధ్వర్యంలో నెమలి పించాలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రాజు (ఫైల్)

ఆలేరురూరల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఆలేరు పట్టణం కాటమయ్యనగర్ కాలనీకి శ్రీముక్క రాజు(20) క్యాటరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి రాజు ఇంటి స్లాబ్‌పై నుంచి వెళ్తున్న విద్యుత్ సర్వీస్ వైరు తెగింది. ఆ వైరు స్లాబ్‌పైన ఉన్న సీకులపై పడడంతో ఇంటికి మొత్తం విద్యుత్ సరఫరా అవుతోంది. రాత్రి 9గంటలకు ఇంటికి చేరుకున్న రాజు స్నానం చేసి ఇంటి ఆవరణలోని దండెం పైఉన్న టవల్‌ను తీసుకుంటున్నాడు. అప్పటికే ఆ దండేనికి విద్యుత్ సరఫరా అవుతుండడంతో రాజు విద్యుదాఘాతానికి గురై స్పృహకోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. సోమవారం పోలీసులు పంచనామా చేశారు. మృతుడి తండ్రి దశరథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

వర్రె సింగన్న సేవలు చిరస్మరణీయం


వర్రె సింగన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు: మండలంలోని సదర్శాపురం గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ వర్రె సింగన్నతో పాటు ఆయన కుటుంబం గ్రామానికి ఎనలేని సేవలు చేసిందని సమాచార హక్కు చట్టు ఉమ్మడి రాష్ట్ర మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ అన్నారు. సోమవారం సదర్శాపురం గ్రామంలో నిర్వహించిన వర్రె సింగన్న దశదిన కర్మకు వారు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సదర్శాపురం గ్రామస్తుల గుండెల్లో వర్రె సింగన్న చిరస్థాయిగా నిలిచిపోతాడన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వీబీ నర్సింహ, అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పల సత్యంయాదవ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు అయోధ్య, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి. లక్ష్మీనర్సింహారెడ్డి, సింగన్న కోడలు, సర్పంచ్ వర్రె కవిత, కుమారుడు వర్రె శ్రీను పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వ్యక్తి మృతి

భువనగిరి: భువనగిరి బస్టాండ్‌లో సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన గోవింద్‌రావు (49) ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. అక్కడి నుంచి దైవదర్శనం కోసం మహారాష్ట్రకు వెళ్లి తిరిగి 14వ తేదీన హైదరాబాద్‌కు వస్తూ భువనగిరి రైల్వే స్టేషన్‌లో దిగాడు. అక్కడ నుంచి బస్టాండ్‌కు వచ్చి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి
- మరణంలోనూ తోడుగానే..


విష్ణు, స్వప్న (ఫైల్)

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణ శివారు పానగల్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. నీలగిరి మున్సిపాలిటీ పరిధి పానగల్‌కు చెందిన ఓర్సు విష్ణు(34) తన భార్య స్వప్న(29)తో కలిసి బైక్‌పై పానగల్ రిజర్వాయర్ ప్రధాన తూము వద్దకు ఉదయం 5:30 గంటలకు వచ్చాడు. అక్కడ బైక్‌ను పార్క్ చేసి దంపతులిద్దరూ చందనపల్లి వైపు వాకింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నల్ల గొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం దంపతుల ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన వారు అక్కడికక్కడే మృతిచెందారు. విష్ణు నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో కామర్స్ కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. గాయపడిన వారిని 108వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటి కే మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పక్షం రోజుల తర్వాత వాకింగ్‌కు వెళ్తే..

ఆ దంపతులకు ఇటీవల తీరిక లేకపోవడంతో వాకింగ్‌కు వెళ్లలేదు. 15రోజుల తర్వాత మంగళవారం వాకింగ్‌కు వెళ్లగా ప్రమాదం చోటుచేసుకుందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతులకు ఆరేళ్ల కుమారుడు కార్తీక్, రెండేళ్ల కుమార్తె విశిష్ట ఉన్నారు. మృతుడి సోదరుడు పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఇటీవల ఇదే రోడ్డులో నకిరేకల్ మండలం తాటికల్ వద్ద జరిగిన ప్రమాదంలో నూతన దంపతులు మృతిచెందారు.

వాహనాన్ని ఢీకొని..


సాయిప్రసాద్ (ఫైల్)

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు.నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన కేసాని స్వామి కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామంలో ఇల్లు కొనుగోలు చేసి అక్కడే నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సాయిప్రసాద్(21) సోమవారం సాయంత్రం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి స్కూటీపై బయటికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తూ రాత్రి 10గంటలకు ఎల్లగిరి శివారులో పేదరాశి పెద్దమ్మ హోటల్ ఎదురుగా ముందున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న సాయిప్రసాద్ తలకు గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందా డు. వెనుక కూర్చున్న అతని స్నేహితులు అభిలాష్, శబరిలకు గాయాలవ్వగా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి


బక్కమ్మ(ఫైల్)

కేతేపల్లి: కేతేపల్లికి చెందిన వీరబోయిన బక్కమ్మ(44) భర్త పదేళ్ల క్రితమే చనిపోవడంతో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. సోమవారం సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామానికి వెళ్లిన బక్కమ్మ అదే రోజు రాత్రి ఆటోలో కేతేపల్లికి చేరుకుంది. ఆటో దిగిన వెంటనే ఇంటికి వెళ్లేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారి సమీపంలో హైవే దాటుతోంది. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై దూరంగా ఎగిరిపడిన బక్కమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. బక్కమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

వాహనం టైరు మారుస్తుండగా..

ఆలేరురూరల్ : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన అశ్వినికుమార్ పాండే(30) సోమవారం రాత్రి అశోక్ లీలాండ్ వాహనంలో అల్లం, వెల్లుల్లి బస్తాలు లోడ్ చేసుకొని వరంగల్‌కు బయలుదేరాడు. అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో వాహనం ఆలేరు శివారులోని బహద్దూర్‌పేట హైవే బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో వాహనాన్ని రోడ్డు ఒకవైపు నిలిపి టైరును మరుస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అశ్వినికుమార్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సంతోష్‌పాడే ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

అన్నా.. నీవెంటే నేనూ..

- ఒక్కరోజు వ్యవధిలో అనారోగ్యంతో సోదరులు మృతి
- బీబీనగర్ మండల గూడూరులో విషాదం


శివారెడ్డి(ఫైల్)


యాదిరెడ్డి(ఫైల్)

బీబీనగర్ : అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఇద్దరు సోదరులు రోజు వ్యవధిలో మృతిచెందడంతో బీబీనగర్ మండలం గూడూరులో విషాదం అలుముకుంది. గూడూరు గ్రామానికి చెందిన కొంతం శివారెడ్డి(80) కొంతం యాదిరెడ్డి(60) తమ కుటుంబాలతో కలిసి పక్క పక్క ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. ఇటీవల అన్నదమ్ములు ఇద్దరు అనారోగ్యం బారిన పడి ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి శివారెడ్డి అస్వస్థతకు గురై మృతిచెందాడు. సోమవారం ఉదయం శివారెడ్డి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగానే సోదరుడు యాదిరెడ్డి సైతం అస్వస్థతకు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి నిర్వహించారు. రోజు వ్యవధిలో సోదరులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు రోదనలు మిన్నంటాయి.

అత్తను చీపురుతో కొట్టిన కోడలు.. కేసు నమోదు

భువనగిరి: అత్తను కోడలు చీపురుతో కొడుతూ హింసించిన ఘటన భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. భువనగిరి పట్టణ సీఐ సుధీర్‌కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన జక్క లక్ష్మమ్మ భర్త మరణించడంతో ఇద్దరు కొడుకుల వద్ద చెరో నెల చొప్పున ఉంటూ జీవనం సాగిస్తుంది. ప్రస్తుతం భువనగిరిలోని ఎల్‌బీనగర్‌లో ఉన్న పెద్ద కొడుకు మధుసూదన్‌రెడ్డి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో మధుసూదన్‌రెడ్డి ఇంట్లో లేని సమయంలో అతడి భార్య పద్మ మంగళవారం అసభ్య పదజాలంతో అత్తను దూషిస్తూ చీపురుతో కొట్టింది. లక్ష్మమ్మ అరుపులు విన్న స్థానికులు అత్తను కోడలు కొడుతున్న తీరును సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న హైదరాబాద్‌లో ఉంటున్న చిన్న కొడుకు అనంతరెడ్డి భార్య వచ్చి భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గాయపడిన లక్ష్మమ్మను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

స్నేహితుడి వేధింపులకు వివాహిత బలి

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట) : స్నేహితుడి వేధింపులకు వివాహత బలైంది. సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్ (ఎస్) మండలం ఇస్తాళ్లాపురం గ్రామానికి చెందిన మున్న మనీష(23)కు మహబూబాబాద్ జిల్లా దాట్ల గ్రామానికి చెందిన శ్యాంతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇస్తాళ్లాపురం గ్రామానికి చెందిన దాసరి వెంకటేష్, మనీష చిన్నతనంలో ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఆ పరిచయంతో అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడుకునేవారు. దీని ఆసరాగా తీసుకున్న వెంకటేష్ ఫోన్ రికార్డులు తన దగ్గర ఉన్నాయని కొంత కాలంగా మనీషను వేధిస్తున్నాడు. ఇటీవల కొన్ని ఫొటోలు, ఆడియో రికార్డులను భర్తకు పంపడంతో మనీష మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో మనీష తల్లిగారింటికి వచ్చి సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పాపమ్మ ఫిర్యాదు మేరకు శ్యామ్‌తో పాటు అతని స్నేహితులు సర్జన్, సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించడం లేదని ఆందోళన


కమిషనర్ చాంబర్‌లో నిరసన తెలుపుతున్న రాయిగిరి నాల్గవ వార్డు ప్రజలు

భువనగిరిటౌన్: రాయిగిరి పరిధిలోని నాల్గవ వార్డు అభివృద్ధికి నోచుకోవడం లేదని, కనీసం డ్రెయినేజీ సమస్య కూడా పరిష్కరించడం లేదని ఆరోపిస్తూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఆ వార్డు ప్రజలు నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ మధ్య ఆధిపత్య పోరు రాయిగిరి వాసులకు శాపంగా మారిందని ఆరోపించారు. అస్తవ్యస్త డ్రెయినేజీతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురుగు నీరు వ్యవసాయ పొలాల్లోకి పోతుండడంతో నాట్లు పెట్టేందుకు కూలీలెవరూ రావడం లేదన్నారు. మున్సిపల్ చైర్మన్, ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. వంటావార్పు చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాలుగ వార్డు కౌన్సిలర్ అరుణపూర్ణచందర్, వార్డు ప్రజలు ఉన్నారు.

స్నేహం విలువ వెలకట్టలేనిది


వేణుశర్మ కుంటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిశోర్ తదితరులు

సంస్థాన్ నారాయణపురం: స్నేహం విలువ వెలకట్టలేనిదని తుంగతుర్తి ఎమ్మెల్యే, సర్వేల్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి గాదరి కిశోర్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సర్వేల్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి వేణుశర్మ ఇటీవల మృతిచెందాడు. దీంతో సర్వేల్ గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో హైదారాబాద్‌లో ఉంటున్న వేణుశర్మ కుంటుంబ సభ్యులకు సోమవారం రూ.15లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం, కోశాధికారి వివేక్, జంపాల రాజు, కష్ణయ్య, భిక్షపతి, శ్రీనివాస్, ఉన్నారు.

బైక్ పైనుంచి పడి యువకుడికి గాయాలు

వలిగొండ: బైక్ పైనుంచి పడి యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన ఎండీ రఫీ వలిగొండ మండల కేంద్రంలో బైక్‌పై వెళ్తూ శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా శతఘటాభిషేకం


పాతగుట్టలో ప్రధాన కలశాన్ని ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు పాతగుట్ట ఆలయంలో మంగళవారం ఉదయం స్వామివారి శతఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో ఆలయ ముఖ మండపంలో 108 బంగారు, వెండి, రాగి కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వయంభూలకు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు శతఘటాభిషేకం నిర్వహించారు. భక్తులు అధికంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు భక్తులు యాదాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన బోగి గణేష్, వరంగంటి నవీన్, దేవర రమేష్, బోగి నరేష్ ఫైనాన్స్ వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టం రావడంతో హైదరాబాద్‌కు వెళ్లి ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే డబ్బుతో అవసరాలు తీరకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 2వ తేదీన నలుగురు లాంగ్ డ్రైవ్ యాప్‌లో నంబర్‌లేని కారును బుక్ చేసుకున్నారు. ఆ కారులో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తూ మార్గమధ్యలో ముందుగా వెళ్తున్న కారు నంబర్‌ను నోట్ చేసుకున్నారు. అనంతరం ఆ నంబర్ గల ప్లేట్‌ను తయారు చేయించుకుని తమ అద్దె కారుకు ఏర్పాటు చేసుకున్నారు. అదే రోజు వరంగల్‌కు వెళ్లి అక్కడే రాత్రి కారులోనే నిద్రించారు.

బెదిరించి మరీ..

ముఠా సభ్యులు ఈ నెల 3న ఉదయం 5గంటలకు వరంగల్ నుంచి జాఫర్‌ఘడ్, తిరుమలగిరి మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సమయంలో బోగి నరేష్ కారు నడుపుతున్నాడు. వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ శివారుకు చేరుకోగానే రోడ్డు మీదుగా ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గమనించారు. సమీపంలోకి వెళ్లి ఆమె నోరు మూసి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు తీసుకుని, వాటికి ఉన్న రెండు పుస్తెలను ఆమెకి ఇచ్చి అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళ వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మరోసారి చైన్ స్నాచింగ్‌కు వెళ్తూ..

ముఠా సభ్యులు మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో చైన్ స్నాచింగ్ పాల్పడేందుకు మేడిపల్లిలోని లాంగ్‌డ్రైవ్ సెంటర్‌కి వెళ్లి కారు అద్దెకు తీసుకున్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి భువనగిరి మీదుగా చిట్యాలకు నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు వలిగొండ మండలం నాగారం గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న వాహనాన్ని నిలిపారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి 33గ్రాముల పుస్తెలతాడు, 5మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, వలిగొండ ఎస్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగ

- అతనికి సహకరించిన వ్యక్తి కూడా అరెస్ట్

భువనగిరి: అంతర్రాష్ట్ర దొంగతో పాటు అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన బీసుపోగు శ్యాంసన్ ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడు ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని నల్లకుంటలో బైక్ దొంగిలించి దానిపై బీబీనగర్ మండలంలోని నెమురగోముల, రాఘవపురం గ్రామాలల్లో తాళం వేసిన రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. అదేరోజు రాత్రి పోచంపల్లి మండలంలోని ముక్తాపూర్‌లో తాళం వేసిన మరో రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి సొమ్మును అపహరించుకెళ్లాడు. దొంగిలించిన సొమ్మును తనకు తెలిసిన శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద ఉంచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం పోచంపల్లి మండంలోని జూలూరు గ్రామంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న శ్యాంసన్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. గతంలో శ్యాంసన్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో 15 కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. శ్యాంసన్‌తో పాటు శ్రీనివాస్‌ను కూడా అరెస్టు చేసి వారి నుంచి 8తులాల బంగారం ఆభరణాలు, 20 తులాల వెండి, రెండు బైకులు, నాలుగు సెలఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


అడవిదేవులపల్లి: చెక్కులు పంపిణీ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అడవిదేవులపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తూ అండగా ఉంటుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన ఆర్చ్, ప్రహరీ నిర్మాణానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్‌తో కలిసి గుత్తా సుఖేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మాడా–ట్రైకార్ పథకం కింద మండలంలోని 74 మంది గిరిజనులకు మంజూరైన రూ.91.25లక్షల విలువైన చెక్కులతో పాటు 70మంది రైతులకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భాస్కర్‌రావు పట్టుబట్టి మరీ రూ.300కోట్లతో కృష్ణపట్టి రైతులు చిరకాల కోరిక అయినటువంటి దున్నపోతుల గండి–చిట్యాల ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారని అన్నారు. పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ సేవ్యానాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల చిన రామయ్య, స్థానిక సర్పంచ్ కొత్త మర్రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్, ఎంపీటీసీలు కుర్ర కాంతి కృష్ణకాంత్‌నాయక్, పేర్ల లింగయ్య, మండల రైతు బంధు అధ్యక్షుడు సూర్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు బాబుజానీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు అశోక్‌నాయక్, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై ప్రధాని విషం చిమ్మారు

నల్లగొండ : ప్రధాని మోదీ తెలంగాణపై విషయం చిమ్ముతున్నాడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ తలుపులు పెట్టి.. తెలంగాణ ఇచ్చారని గతంలో అన్నాడని, తెలంగాణలో ఆనాడు రక్తపుటేర్లు పారాయని అనడం అర్థరహితం అని అన్నారు. ప్రధాని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో పారిన రక్తపుటేరు సంఘటనలు ఇంకా మరిచిపోనట్లు ఉందని సుఖేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆనాడు వాజ్‌పేయ్ నాయకత్వంలో బీజేపీ మూడు రాష్ట్రాలు ఇచ్చిన సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని కూడా ఇస్తే ఎవరూ చనిపోయేవారు కాదన్నారు. కేసీఆర్ అలుపెరుగని పోరాటం ఫలితంగానే కేంద్రం దిగి వచ్చి తెలంగాణ ఇచ్చిందని, ప్రజల ఒత్తిడి మేరకు తెలంగాణ ఏర్పాటు అయిందని అన్నారు. మోదీ మాట్లాడే దాంట్లో అర్థం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టేలా హామీలు ఇస్తుందని సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. 6 గ్యారంటీ హామీలు ఉత్తివేనని, వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఏది చేయాలన్నా ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లనే సాధ్యమవుతుంది, అది తెలంగాణ ప్రజలకు తెలుసు అని అన్నారు. కాంగ్రెస్‌కు విజన్ లేదన్నారు. గ్యారంటీ హామీల్లో రూ.2 లక్షల రుణమాఫీని ఎందుకు మర్చిపోయారని ప్రశ్నించారు. తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే పారిపోయిన వ్యక్తి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం బీజేపీ పని అని, బీజేపీ పతనం ప్రారంభం అయింది.. అందుకే మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు అంటూ హడావుడి చేస్తున్నారని అన్నారు. మహిళా బిల్లుతోపాటు ఓబీసీ బిల్లు కూడా ఆమోదించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- ప్రైవేట్ ఆస్పత్రిపై దాడి.. ఫర్నీచర్ ధ్వంసం


రోదిస్తున్న మృతుడి బంధువులు


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. అతడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రిపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన లింగయ్య(55) జ్వరంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు అతడిని సోమవారం ఉదయం నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో గల సంకల్ప్ ఆస్పత్రిలో చేర్పించారు. లింగయ్య మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పరిస్థితి విషమించి చనిపోయాడు. దీంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైద్యులు సరైన చికిత్స అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అనవసరమైన ఇంజక్షన్లు, ట్యాబ్లెట్‌లు ఇచ్చినందు వలనే చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రిలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి సిబ్బందిపై చేయిచేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పడంతో శాంతించారు.

గుండెపోటుతో మృతిచెందాడు - ఆస్పత్రి వైద్యులు


మాట్లాడుతున్న డాక్టర్‌లు

లింగయ్యకు చికిత్స విషయంలో తమ నిర్లక్ష్యమేమీ లేదు. రోగుల ప్రాణాలు కాపాడడమే మాకు ముఖ్యం. లింగయ్యకు ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో పాటు టీబీ కూడా ఉంది. అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLES FOR SALE

■ Commercial Vehicles for Sale Eicher Pro 2114 XP HHSD 20 Ft BS6 Model 2023 Rigistration No. TS 05 UF 1995 and TATA LPT 3118 12 Tyre 2019 Model Registration No. TS 05 UD 2525 Contact No: 9550119022, 9677035841. Indus Ind Bank-IInd Floor, Plot No: 58, 59 Reddy Colony, Miryalaguda-508207 [Y-784219]

Services

BUSINESS OFFER

■ Gamgana Flutures కంపెనీలో కేవలం అతితక్కువ పెట్టుబడితో ఆర్థిక ఆదాయం పొందే గొప్ప అవకాశం, డైలీ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, Dont Miss సంప్ర।। 7396065388 [G-751650]

LOST

■ ధూళిపాల నిఖిల్ చక్రవర్తి S/o ధనుంజయ నాయుడు గ్రామం నేరేడుచర్ల నాయొక్క పదవ తరగతి మెమో రామాపురం రోడ్ నుండి నేరేడుచర్లకు బైక్‌పై వెళ్లుచుండగా పోయినది. దొరికిన వారు సంప్ర।। సెల్: 7780873325 [Y-784382]

Wanted

■ మా ఆఫీసు నందు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంతో పార్ట్ టైమ్ / ఫుల్ టైం ద్వారా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-751694]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పని చేయుటకు అభ్యర్థులు కావలెను. Work from Home కూడా అందుబాటులో ఉంది. P/T-8000, F/T-ఆకర్షణీయమైన జీతం. 81791 75150 [G-24]

■ ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1122]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.